తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
8 అక్టోబర్ 2026
పేజీలు : 08



Follow :



## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు

- **అనధికార ర్యాంపులపై అనుమతులు పరిశీలించాలి.. ఉల్లంఘనలుంటే చర్యలు**
- **ఫ్రీ-లెఫ్ట్‌లు, ఓపెన్ స్పేస్‌ల అభివృద్ధికి ప్రణాళికలు**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (జనం సాక్షి):** సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ బుధవారం విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ, రహదారి ఆక్రమణలు, అనధికార ర్యాంపులు, ఫ్రీ-లెఫ్ట్‌ల ఏర్పాటు, ఓపెన్ స్పేస్‌లు, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.సీఎన్‌జీ రీఫిల్లింగ్ స్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డుపై వాహనాల నిలుపుదల, వీధి వ్యాపారాలతో ఏర్పడుతున్న రద్దీని పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా స్టేషన్ ప్రాంగణంలోనే బ్యారికేడింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు.విక్టోరియా మెమోరియల్ మెట్రో సమీపంలోని రహదారిపైకి విస్తరించిన ర్యాంపుల అనుమతులను పరిశీలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ర్యాంపులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ సులభతరం చేసేందుకు ఫ్రీ-లెఫ్ట్‌లకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని డిప్యూటీ కమిషనర్‌కు సూచించారు. కొత్తపేట లక్ష్మీనగర్ కాలనీలోని ఓపెన్ గ్రౌండ్‌ను పరిశీలించిన కమిషనర్.. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. వాకింగ్ ట్రాక్, మరుగుదొడ్లు తదితర సౌకర్యాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. డాక్టర్స్ కాలనీ మెయిన్ రోడ్ మార్కెట్‌లో ట్రాఫిక్, వీధి దీపాలు, ఫ్రీ-లెఫ్ట్ సమస్యలను పరిశీలించి సంబంధిత విభాగాలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. రహదారులపై ట్రాఫిక్ సాఫీగా సాగేలా, ప్రజా స్థలాలను పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలకు తక్షణ పరిష్కారాలతోపాటు శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



## ఏకపక్షంగా వ్యవహరిస్తున్న ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి : బాధితుడు మహేందర్

**శంకర్ పల్లి, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న శంకర పల్లి ఎస్సై శ్రీశైలం పై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆలంఖాన్ గూడ గ్రామస్తుడు మహేందర్ వాపోయారు.శంకర్ పల్లి లో ఆయన గ్రామస్తులతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి భోజిరెడ్డి ఇంటి ముందు గల అరుగుపై భోజిరెడ్డి తో కలిసి తాను మాట్లాడు కుంటుండగా కొందరు వ్యక్తులు వచ్చి తమను అకారణంగా బూతులు తిడుతూ దాడి చేశారని వాపోయాడు. అయితే రాత్రి జరిగిన సంఘటనపై వెంటనే శంకర్ పల్లి పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని తెలిపారు.రాత్రి ఫిర్యాదు చేస్తే ఉదయం వరకు పోలీసులు ఎవరు గ్రామాన్ని సందర్శించకుండా ఫిర్యాదు గురించి తెలుసుకునేందుకు బుధవారం ఉదయం తామే పోలీస్ స్టేషన్ కు వెళ్లగా ఎస్సై శ్రీశైలం భోజిరెడ్డిని లాక్కెళ్ళి లాకప్లో వేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను రాత్రి సంఘటన జరిగిన వెంటనే మొదటగా ఫిర్యాదు చేశామని గ్రామానికి వచ్చి విచారణ చేయకుండా స్టేషన్కు వచ్చిన భోజిరెడ్డిని లాకప్ లో ఎలా వేస్తారని ఆయన ప్రశ్నించారు.జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి తమకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.ఇదే విషయమై శంకరపల్లి ఇన్స్పెక్టర్ రుధ్విర్ కుమార్ ను వివరణ కోరగా 2025 లో భోజ రెడ్డి పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యిందని, తిరిగి బుధవారం సైతం అతనిపై ఫిర్యాదు రావడంతో సెల్లో వేశామని తెలిపారు.







## ముడుపుల ఆరోపణలు.. మౌనం వెనుక మతలబేంటి?

- **బోడుప్పల్‌లో టౌన్‌ప్లానింగ్ పర్యవేక్షణపై అనుమానాలు**
- **ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు శూన్యం!**
- **అనుమతులకు మించి నిర్మాణాలంటూ స్థానికుల ఆరోపణలు**
- **కమిషనర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**బోడుప్పల్, అక్టోబర్ 7 (జనంసాక్షి):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు కొనసాగుతున్నప్పటికీ బోడుప్పల్ సర్కిల్‌లో మాత్రం నిబంధనల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతులకు మించి అదనపు అంతస్తులు, భారీ షెడ్లు, అనుమతులు లేని నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ ఉల్లంఘనలు ఎలా కొనసాగుతున్నాయనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పెంటారెడ్డి కాలనీలో 400 గజాలకు అనుమతి తీసుకుని అదనంగా రెండు అంతస్తులు నిర్మించారనే ఆరోపణలతో పాటు పీర్జాదిగూడ గ్లోబల్ స్కూల్ సమీపం, బోడుప్పల్ ప్రధాన రహదారిలో ముద్రా స్కూల్ పక్కన అదనపు అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సాయి ఐశ్వర్య మెయిన్ రోడ్డులో షాపులు, అదనపు అంతస్తులు, పూసల గోదాం సమీపంలో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతోందని పేర్కొంటున్నారు. వీటిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెబుతున్నారు. అధికారుల ఫోన్ లోపలి పేజిలో

## వ్యసనాల నుంచి బయటపడండి

- **గౌరవప్రదమైన జీవితం గడపండి**
- **పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్‌లో షీ టీమ్ అవగాహన సదస్సు**



**హయత్ నగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి) :** మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితాన్నే కాకుండా కుటుంబ వ్యవస్థను, ముఖ్యంగా మహిళలు, పిల్లల భద్రతను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని వనస్థలిపురం షీ టీమ్ ఇన్‌ఛార్జ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ పి. శ్రీనివాస్ పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యపానం వంటి వ్యసనాలకు బానిసైన వారు ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధి లోని వనస్థలిపురం షీ టీమ్ ఆధ్వర్యంలో పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్‌లో డ్రగ్స్, గంజాయి, మద్యపాన వ్యసనపరుల కోసం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్, ఉమెన్ సేఫ్టీ విభాగం డీసీపీ టి. ఉషారాణి ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా షీ టీమ్ ఇన్‌ఛార్జ్ ఎస్ఐ పి. శ్రీనివాస్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల ఆరోగ్యం, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సంబంధాలు దెబ్బతినడంతో పాటు వ్యక్తి భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతుందని వివరించారు. వ్యసనానికి బానిసైన వ్యక్తి ప్రభావం కుటుంబ సభ్యులపై కూడా తీవ్రంగా ఉంటుందని, ముఖ్యంగా మహిళలు మానసికంగా, శారీరకంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండటంతో పాటు, ఇప్పటికే వ్యసనానికి గురైన వారు సరైన చికిత్స, కౌన్సెలింగ్ ద్వారా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని సూచించారు. వ్యసనం ఒక సమస్య అయినప్పటికీ దాని నుంచి బయటపడేందుకు సరైన చికిత్స, కుటుంబ సభ్యుల సహకారం, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని అధికారులు తెలిపారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు మత్తు పదార్థాలను పరిష్కారంగా భావించకుండా, ధైర్యంగా వాటిని ఎదుర్కొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించాలి. మహిళలు, యువతులు లేదా ఇతరులు ఏదైనా ప్రమాదం, వేధింపులు, హింస లేదా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్నప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని షీ టీమ్ సిబ్బంది సూచించారు.

అత్యవసర సమయాల్లో డయల్ 100 లేదా 112కు ఫోన్ చేసి తక్షణ పోలీసు సహాయం పొందవచ్చని తెలిపారు. అలాగే మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అధికారిక వాట్సాప్ నంబర్ 8712662111ను సంప్రదించి సమస్యను తెలియజేయవచ్చని సూచించారు. సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు, కుటుంబ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పునర్జన్మ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రతినిధులు రవి చౌదరి, వేణుగోపాల్ రెడ్డి, జోనతన్, వనస్థలిపురం షీ టీమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం



యాలాల అక్టోబర్ 7 ( జనంసాక్షి ) : వికారాబాద్ జిల్లా యాలాల మండలం దౌలాపూర్ రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 73లో ప్రభుత్వ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కోసం భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం అందేలా సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తాండూరు ఆర్డీఓ అనిత తెలిపారు.బుధవారం ఆమె ప్రతిపాదిత పాఠశాల నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నష్టపరిహారం త్వరగా మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యాలాల తహసీల్దార్ గాయత్రి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యు. బుగ్గప్ప, ఎంఆర్‌పీఎస్ నాయకుడు మహేందర్, రైతులు వెంకటయ్య, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యం

### అల్వాల్‌లో ప్రధాని మోదీ సందేశాన్ని వీక్షించిన బీజేపీ శ్రేణులు



అల్వాల్, అక్టోబర్ 7 (జనంసాక్షి): 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని 25 ఏళ్ల పాలనా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప సభ ప్రసంగాన్ని మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో ఇందిరానగర్ కాలనీలోని శోభ గార్డెన్స్‌లో బుధవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు.కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ 25 ఏళ్ల పాలనా ప్రస్థానం దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించిందన్నారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గిరి వర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, తాడూరి శ్రీనివాస్, మల్లారెడ్డి, మహిళా అధ్యక్షురాలు శిల్పారెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలి

### మర్పల్లి తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి



మర్పల్లి అక్టోబర్ 07 (జనంసాక్షి) మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని మర్పల్లి తహసిల్దార్ మనోహర్ చక్రవర్తి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ శాసనమండలి ఎన్నికల నేపథ్యంలో మర్పల్లి మండల పరిధిలోని అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రుడు తప్పనిసరిగా తమ ఓటు హక్కును దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. 2023 అక్టోబర్ 31 లోపు డిగ్రీ లేదా సమానమైన విద్యార్హత పూర్తి చేసి ఉండాలని, గతంలో పట్టభద్రుల శాసనమండలి ఓటు హక్కు ఉన్నవారు కూడా ప్రస్తుతం కొత్తగా ఫారం -18 ద్వారా తమ పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.6 నవంబర్ 2026 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపాడు. అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

## మారుతి నగర్‌లో చెత్త కుప్పలు.. వీధికుక్కలతో ప్రజలకు భయం

### అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కాలనీవాసుల డిమాండ్

జవహర్‌నగర్, అక్టోబర్ 7 (జనంసాక్షి):జవహర్‌నగర్ చంద్రపురి కాలనీ-2 పరిధిలోని మారుతి నగర్‌లో పారిశుధ్య సమస్య తీవ్రంగా మారింది. కాలనీలో ఎక్కడ చూసినా చెత్తాచెదారం కుప్పలుగా పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో పాటు మురుగు పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చెత్త కుప్పల వద్ద వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తుండటంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పారిశుధ్య సమస్యతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై మున్సిపల్ అధికారులకు, కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు వీధికుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా స్థానిక నాయకుడు బూడిద వెంకటేష్ మాట్లాడుతూ.. మారుతి నగర్‌లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. దుర్వాసనతో కాలనీవాసులు తీవ్ర



ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.కాలనీవాసి శ్రీ విద్య మాట్లాడుతూ.. చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని, వీధికుక్కల సంచారంతో పిల్లల భద్రతపై ఆందోళన నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.అధికారుల నిర్లక్ష్య వైఖరిపై కాలనీవాసులు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు వీధికుక్కల సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మంజుల, హేమవతి, చంద్రకళ, మీనాక్షీఅమ్మ, సరస్వతి, శంకరమ్మ, సురేష్, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఫీజు బకాయిలు ఇవ్వండి

### బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ధర్నాలో వక్తల హెచ్చరిక

ముషీరాబాద్, అక్టోబర్ 7 (జనం సాక్షి):పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకం కలిగించకుండా ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను సత్వరమే విడుదల చేయాలని బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ డిమాండ్ చేసింది. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను సత్వరమే విడుదల చేయాలని కోరుతూ బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా జరిగింది. ధర్నాలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ, అర్. కృష్ణయ్య, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్ మహరాజ్, వి. జీ.అర్. నారగోనీలు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అగ్రకుల రాజ్యానికి పెద్దపీట వేస్తుందని విమర్శించారు. రైతు బంధు, మెట్రోరెండో దశకు డబ్బులు వస్తాయి కానీ మా పిల్లలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వడానికి నిధులు ఉండవా అని ప్రశ్నించారు. గత పాలకులు సైతం పిల్లల ఫీజులు ఇవ్వకుండా మొండి వైఖరి అవలంబిస్తే వాళ్లను కుర్చీ దించేశామని గుర్తు చేసిన వారు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. తక్షణమే ఫీజు బకాయిలను కాలేజీ యాజమాన్యాల ఖాతాలలోనే వేయాలనీ, లేదంటే సీఎం ఇల్లు ముట్టడిస్తామనీ వారు హెచ్చరించారు. పిల్లల చదువుకు డబ్బులు




కేటాయించడం అంటే ప్రభుత్వం పెట్టుబడి అని, అది వేయి రెట్లుగా తిరిగి వస్తుందనీ, వెంటనే ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను చెల్లించాలనీ సూచించారు. బిసి ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి రాజ్ కమల్ మహరాజ్ , రాసాల వినోద్ యాదవ్, రాము యాదవ్, పూసల సాయి బాబా, బాలయ్య ముదిరాజ్, చందా మల్లయ్య, పొడకంటి రాంబాబు చారి, మేకల సుమన్, కందేల సుమన్ సహ అదిక సంఖ్యలో విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి: తలసాని సాయి కిరణ్ యాదవ్

అమీర్పేట్ (జనం సాక్షి ): విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్ అన్నారు. మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ జన్మదినం సందర్భంగా మోండా డివిజన్ ఆదయ్యనగర్ గ్రౌండ్‌లో నిర్వహించిన అండర్-17 బాలబాలికల వాలీబాల్ పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. కార్యక్రమానికి సాయి కిరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.బాలుర విభాగంలో ఆరు, బాలికల విభాగంలో ఐదు జట్లు పోటీపడ్డాయి. బాలుర విభాగంలో మేడ్చల్‌కు చెందిన సంస్కార్ స్కూల్ జట్టు ప్రథమ, కూకట్‌పల్లికి చెందిన దేవకుల్ గీతాంజలి స్కూల్ జట్టు ద్వితీయ బహుమతి సాధించాయి. బాలికల విభాగంలో ఖైరతాబాద్‌కు చెందిన నాసర్ స్కూల్ జట్టు ప్రథమ, దేవకుల్ గీతాంజలి స్కూల్ జట్టు ద్వితీయ బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు తలసాని సాయి కిరణ్ యాదవ్, తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని మహేష్ యాదవ్ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా సాయి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమని, గెలుపే లక్ష్యంగా క్రీడాకారులు కృషి చేయాలని సూచించారు. ఇలాంటి పోటీలను అవకాశంగా మలుచుకొని తమ నైపుణ్యాలను



మరింత మెరుగుపరుచుకోవాలని, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తలసాని ట్రస్ట్ అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో రోడ్డు రవాణా రీజినల్ మేనేజర్ కిరణ్, హైదరాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మురళి, ఆదయ్యనగర్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ ఆనంద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ విజయానంద్, మల్లేష్ యాదవ్, మేరీ మనీషా తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన నీటిని తాగాలి

### బిజెపి రాష్ట్ర నాయకులు శరత్ కుమార్ రెడ్డి

పరిగి అక్టోబర్ 7 జనం సాక్షి::దోమ మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు 30,000/-ల రూపాయల విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్ అందించిన కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు శరత్ కుమార్ రెడ్డి . తదుపరి శరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు శుద్ధి చేసిన తాగాలని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సలహాలను సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో దోమ మండలం ఎంఈఓ వెంకట్ , పాఠశాల ఉపాధ్యాయ బృందం, అమర్ నాథ్, పి



ఆర్ టి యు దోమ మండలం అధ్యక్షులు కేశవులు, బీజేపీ మండల అధ్యక్షులు మల్లేశం, మల్లప్ప,మల్లయ్య, మొగులయ్య గౌడ్, చెన్న కిష్టయ్య, అంజిలయ్య,తిరుమలేశ్, విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చిన్నారుల్లో జ్ఞానాన్ని పెంపొందించడంలో మొలక కృషి అభినందనీయం

### చాకలి ఐలమ్మ యూనివర్సిటీ వీసీ డా. సూర్య ధనంజయ



**తాండూరు ఆక్టోబర్ 7(జనంసాక్షి)**చాకలి ఐలమ్మ యూనివర్సిటీలో మొలక బాలల మాస పత్రిక అక్టోబర్ నెల సంచికను యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సూర్య ధనంజయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డా. సూర్య ధనంజయ మాట్లాడుతూ చిన్నారుల్లో జ్ఞానాన్ని పెంపొందించేందుకు మొలక బాలల మాసపత్రిక చేస్తున్న కృషి అభినందనీయం. నిత్య సత్యాలు, కవితలు, సామెతలు, శాస్త్రవేత్తల పరిచయాలు, మెదడుకు మేత పజిల్స్, కరెంట్ అఫైర్స్, బొమ్మలు ఎలా వేయాలి వంటి విభిన్న అంశాలను అందిస్తూ విద్యార్థుల్లో జ్ఞానాన్ని పెంపొందిస్తున్న తీరు ప్రశంసనీయం మని అన్నారు. చిన్నారుల్లో జ్ఞాన మొలకలను నాటేందుకు కృషి చేస్తున్న మొలక ఎడిటర్ వేదాంత సూరిని, స్పెషల్ కరస్పాండెంట్ కేవిఎం వెంకట్ ను అభినందిస్తున్నానని తెలిపారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతూ తరగతి గదిలో ఆంగ్లంలో పాఠాలు చెబుతున్న చింతకింది వరుణ్ ప్రతిభను కూడా డా. సూర్య ధనంజయ అభినందించారు. వరుణ్ ను మొలక' ముఖచిత్రంగా పరిచయం చేస్తూ తరగతి గదిలో వరుణ్ సందేశం అనే శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించడం అభినందనీయ మన్నారు. వరుణ్ కు మార్గనిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుడు రమేష్ ను కూడా ఫోన్ లో అభినందించారు. అలాగే విద్యార్థి వరుణ్ తన ఉపాధ్యాయుడు రమేష్ కు ఫోన్ చేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ శివప్రసాద్ శాస్త్రి, గో ఆధారిత వ్యవసాయ ప్రచారకురాలు డాక్టర్ గొంది ఝాన్సీ లక్ష్మీబాయి, పలువురు ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

# అవుట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.30 వేల వేతనం చెల్లించాలి

### సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్



**హయత్‌నగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి)**జీహెచ్ఎం సి, ఎంఎంసీ లలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు కేటగిరీల వారీగా రూ.30 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సీఐటీయూ జీహెచ్ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా సీఐటీయూ సీనియర్ నాయకులు తుమ్మల సత్తిరెడ్డి హాజరై, మాట్లాడుతూజీహెచ్ఎంసీ ఎంఎంసీ అవుట్‌సోర్సింగ్ కార్మికులు గత 40 ఏళ్లుగా హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నప్పటికీ, వారి జీవన పరిస్థితుల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని అన్నారు. కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు 2 శాతం టీడీఎస్ మినహాయిస్తున్నారని, టీడీఎస్ పేరుతో కట్ చేస్తున్న మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కేటగిరీల వారీగా రూ.30 వేల వేతనం చెల్లించాలని, సొసైటీల ద్వారా కాకుండా ప్రభుత్వం నేరుగా కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రెండో పీఆర్సీని ప్రకటించి డీఏను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొస్తున్న చట్టాలను రద్దు చేయాలని కోరుతూ అక్టోబర్ 26న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తుమ్మల సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే డిసెంబర్ 12, 13 తేదీల్లో నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో చింతపల్లి కృష్ణయ్య, ముషం నరహరి, అలివేలు, దాసరి జయమ్మ, అనసూర్య, శాంతమ్మ, హేమలత, రేణుక, విజిత, సౌందర్య, లక్ష్మమ్మ, శ్రీను, మహేష్, రాజు, బాలరాజ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో పెరిగిన రోగుల తాకిడి

### రోజుకు 5 వేలకుపైగా రోగులు, ఈనెల 5న ఒక్కరోజే 5,635 ఓపీ




**ఖైరతాబాద్, అక్టోబర్ 07 (జనం సాక్షి) :** నిమ్స్ ఆసుపత్రిలో గత నెల రోజులుగా రోగుల తాకిడి గణనీయంగా పెరిగింది. ఓపీ, ఇన్‌పేషెంట్ సేవలతో పాటు వివిధ వైద్య పరీక్షలు చేయించుకునే వారి సంఖ్య కూడా భారీగా పెరుగుతోంది. ఈ నెల 5న ఒక్కరోజే 5,635 మంది ఓపీ సేవలు పొందగా, 5,088 మంది వివిధ వైద్య పరీక్షలు చేయించుకు న్నారు. అదే రోజు 306 మంది ఇన్‌పేషెంట్‌లుగా చేరినట్లు ఆసుపత్రి గణాంకాలు వెల్లడించాయి. గతంలో నిమ్స్‌లో రోజుకు సుమారు 3,500 మంది ఓపీకి వచ్చేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య 5 వేలకుపైగా నమోదవుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఎమర్జెన్సీ విభాగంలోనూ రోగుల సంఖ్య పెరిగింది. గతంలో రోజుకు సుమారు 50 మంది ఎమర్జెన్సీ సేవలకు చేరుకోగా, ప్రస్తుతం 80 నుంచి 90 మందికి పెరిగింది. నిమ్స్‌లో అందుబాటులో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన వైద్య సేవలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి రోగుల సంఖ్య పెరుగుదల నిదర్శనమని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఓపీ రిజిస్ట్రేషన్ సమయాన్ని ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉండగా, ప్రస్తుతం మధ్యాహ్నం 2 గంటల వరకు పొడిగించారు. దీంతో పాటు పలు వైద్య పరీక్షల రిపోర్టులను అదే రోజు అందించడం కూడా రోగులకు సౌకర్యంగా మారిందని తెలిపాయి.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి

### ఏ.ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్



**మోమిన్ పేట అక్టోబర్7 (జనం సాక్షి)**నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ విలువైన వస్తువులను తామే జాగ్రత్తగ చూసుకోవాలనిమోమిన్ పేట్ ఏ.ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మోమిన్ పేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ గాని, ఓటిపి నెంబర్లు గాని, ఎవరికి చెప్పకుండా, అలాగే అపరిచిత వ్యక్తుల పట్ల, బస్సుల్లో ప్రయాణిస్తున్న, సమయంలో బస్టాండ్ లో తమకు తాము అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ప్రతి మహిళకు, ప్రతి విద్యార్థికి ఉండాలని ఆయన హితవు చెప్పారు. అలాగే బస్సుల్లో ప్రయాణిస్తున్న సమయంలో బస్టాండ్లో గొలుసు దొంగలు, జేబుదొంగలు, మొబైల్స్ దొంగలు, జనసంచార ప్రదేశాల్లో తమ బంగారు ఆభరణాలను తమ ఫోన్లను తమకు తామే కాపాడుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శంకర్ నాయక్, ఆర్టీసీ కంట్రోలర్ శ్రీరాజు, కానిస్టేబుల్, రాజేందర్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ లో వన్డే వన్ వార్డు పర్యటన



**రాజేంద్రనగర్,అక్టోబర్7(జనంసాక్షి)**"వన్ డే వన్ వార్డ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఖానాపూర్ గ్రామం, 126వ వార్డులో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. ఫిరంగి నాలా పరిశుభ్రత, భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సరఫరా, దోమల నివారణ, సుమారు 1.5 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం వంటి సమస్యలను స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సంబంధిత ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్, బిల్ కలెక్టర్ రవీందర్ రెడ్డి, వార్డు అధికారి ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, అరుణ్ స్థానిక నాయకులు గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, ఆర్. నరసింహ అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన లబ్ధిదారులు అందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

### సర్పంచ్ లావణ్య మోహన్



**మోమిన్ పేట అక్టోబర్ 8( జనం సాక్షి)**అర్హులైనలబ్ధిదారులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం శాసన సభాపతి,గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో రేషన్ కార్డు లేని లబ్ధిదారులందరినీ గుర్తించి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు సర్పంచ్ లావణ్య మోహన్ తెలిపారు బుధవారంమండల పరిధిలోని దుర్గం చెరువుగ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులు అర్హులైన లబ్ధిదారులకు అధికారులు నాయకుల తొ కలిసి లబ్ధిదారులకు సర్పంచ్ స్మార్ట్ రేషన్ కార్డుల కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డ్ పంపిణీ చేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయత్ కార్యదర్శి లక్ష్మి జిపిఓ వెంకట్ రెడ్డి మోమిన్ పెట్ పిఎసిఎస్ డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్ రమేష్ పటేల్ మండల్ ఎస్సి సెల్ అధ్యక్షులు ఎల్. కృష్ణ ఏఎంసీ డైరెక్టర్ బంటు వెంకటేశం ఉపసర్పంచ్ సరియాబి పంచాయతీ వార్డు సభ్యులు పంచాయతీ సిబ్బంది రేషన్ డీలర్స్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి



**మొయినాబాద్, అక్టోబర్07, జనంసాక్షి:**లారీ బీభత్సానికి ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందిన విషాద ఘటన చేవెళ్ల మండలం గొల్లపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మధు (36), భార్య సావిత్రి (30), కుమారుడు ధనూష్ (6), తొమ్మిదేళ్ల కుమార్తెతో కలిసి చేవెళ్ల మండలం చన్వెల్లి గ్రామంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా గొల్లపల్లి సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ బైక్ను ఢీకొట్టింది. దీంతో మధు, సావిత్రి, ధనూష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాలికను చేవెళ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కాటేదాన్ గగన్ పహాడ్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



**రాజేంద్రనగర్,అక్టోబర్7(జనంసాక్షి)** కటేదాన్ గగన్‌పహాడ్ ప్రధాన రహదారిపై హెచ్‌ఎండబ్ల్యూఎస్ పనులు 3--4 ఏళ్లుగా కొనసాగుతున్నా రహదారి పునరుద్ధరణ జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి పేర్కొన్నారు. పలుచోట్ల తవ్వకాలు, గుంతలతో ప్రమాదాల ముప్పు పెరిగిందన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి రహదారిని నాణ్యతతో పునరుద్ధరించాలని, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ స్పందించి అధికారులతో సమీక్ష నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగు రవి, అడికే రాజు, అడికే మహేంద్ర పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

### సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

### గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సునీల్ కుమార్



**యాచారం, అక్టోబర్ 7(జనం సాక్షి )**మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నందున, ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. కురుమిద్ద గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్ లు, మరియు లింకుల పట్ల విద్యార్థులు, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరికీ షేర్ చేయకూడదని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండురంగారెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న రాణి, వీరమణి, శ్రీదేవి, పాఠశాల విద్యార్థులు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ధనంకంటే ముఖ్యం ఆరోగ్యం

### ఇరుముడి సినిమా డైరెక్టర్ శివనిర్వాణ్



**మొయినాబాద్ జనం సాక్షి అక్టోబర్ 07::** ప్రజలకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమైందని ధనం కంటే విలువైనది ఆరోగ్యమేనని ప్రతి ఒక్కరుఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గ్లోబల్లో నెంబర్ వన్ సినిమా ఇరుముడి సినిమా డైరెక్టర్ శివనిర్వాణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ సమీపంలో గల ఆరోగ్య గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇరుముడి సినిమా డైరెక్టర్, ఎడిటర్ పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒకరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏ వని నైనా చేయడానికి ఉల్లాసంగా ఉత్సాహం ఉంటారన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంపై అలసట వీడనాడి కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఆరోగ్య గ్రామంలో ఎంతో మంచి సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా వంటపోలాల్లో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం నిర్వహకులు డాక్టర్ లక్ష్మణ్ను అభినందించారు. ప్రతి ఒక్కరు తినే ఆహార పదార్థాలను నాణ్యతతో కూడిన పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఇరుముడి సినిమా ఎడిటర్ ప్రవీణ పూడి, ప్రొడ్యూసర్ శ్రీనివాస్, సినీనటి మణమ్మ, ప్రొడక్షన్ మేనేజర్ వల్లి, ఆరోగ్య గ్రామ కోఆర్డినేటర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పర్యటనను వక్రీకరించి ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ మండల కమిటీ ఫిర్యాదు




**యాచారం, అక్టోబర్ 7(జనం సాక్షి )**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ విద్యార్థులు, మహిళలతో మాట్లాడిన దృశ్యాలను వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ యాచారం మండల పార్టీ అధ్యక్షుడు మోటే శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మోటే శ్రీశైలం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచితంగా కల్పిస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం అమలు తీరును నేరుగా తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారని తెలిపారు. ప్రయాణ సమయంలో మహిళలు, విద్యార్థులతో ఎమ్మెల్యే ఆప్యాయంగా మాట్లాడారని, ఆ దృశ్యాలను కొంతమంది ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కదులుతున్న బస్సులో చోటుచేసుకున్న కొన్ని దృశ్యాలను ఆధారంగా చేసుకుని బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం స్వార్థంతో ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే ఒక న్యూస్ ఛానెల్ ఈ ఘటనను ప్రసారం చేసిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న సోషల్ మీడియా ఖాతాలను తక్షణమే గుర్తించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి వైస్ ప్రెసిడెంట్ ముత్యాల వెంకట్ రెడ్డి, సర్పంచ్ కేశమోని రాజు, కిషన్ నాయక్, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, దూస రమేష్, గుంగల్ ఉప సర్పంచ్ మచ్చ అనిల్, మాజీ ఎంపీటీసీ మాధవి మల్లేష్, ఉప్పల భాస్కర్, యాచారం గ్రామ అధ్యక్షుడు రాజి రెడ్డి, రెడ్డి వెంకట్ రెడ్డి, బుచ్చయ్య, తక్కళ్లపల్లి గ్రామ అధ్యక్షుడు తులసి, కుర్మిద్ద అధ్యక్షుడు జోసెఫ్, శివ రెడ్డి, సాయి చరణ్, అంజన్, రాము, రమేష్, కుమారచారి, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరువలేనివి

### : తలసాని శ్రీనివాస్ యాదవ్



**అమీర్‌పేట్ (జనం సాక్షి):** తనపై నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న ప్రేమాభిమానాలను ఎప్పటికీ మరువలేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన క్యాంపు కార్యాలయానికి పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలతో సన్మానించి స్వీట్లు అందజేశారు. మంగళవారం తన పుట్టినరోజు అయినప్పటికీ బుధవారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తలసాని శ్రీనివాస్ యాదవ్ కలుసుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంతో పాటు దిల్‌సుఖ్‌నగర్, కార్వాన్, కంటోన్మెంట్ తదితర ప్రాంతాల నుంచి కూడా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ తన పుట్టినరోజును పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కేక్ కటింగ్, అన్నదానం, పండ్ల పంపిణీ, రక్తదాన శిబిరాలు నిర్వహించిన వారిని అభినందించారు. అమీర్‌పేట్‌లో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, టి. మహేశ్వరి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, హన్మంతరావు, శ్రీనివాస్ గౌడ్, నాయకులు దాడి ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కొండాపురం మహేష్ యాదవ్, రాజేష్ ముదిరాజ్, కిషోర్, ఆంజనేయులు, కూతురు నర్సింహ, కట్టా బలరాం, కోటేశ్వర్ గౌడ్, లక్ష్మీపతి, శేఖర్, ఆరీఫ్, అఖిల్, ఉత్తమ్‌సింగ్, గులాబ్‌సింగ్, లలితా గోపిలాల్ చౌహన్, నోమాన్, హరిసింగ్, ప్రవీణ్, పీజీ రోడ్డు అసోసియేషన్ ప్రతినిధులు సంజయ్, రోచా, అమీర్‌పేట్ సిక్కు సమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్‌దే



### ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**హయత్ నగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి)**దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) కే దక్కుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నాగోల్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ నాయకత్వంలో దళిత బంధు పథకం ద్వారా మరింత పెద్ద సంఖ్యలో అర్హులైన దళితులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు స్థానంలో ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పి దళితులను మోసం చేసిందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో దళితులంతా ఐక్యంగా ఉండి ముందడుగు వేస్తున్నారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు గోల్కొండ మైసయ్య, మల్లెపాక యాదగిరి, ఉమామహేశ్వర్, పార్షపు శ్రీధర్, మద్దెల నర్సింహ, రుద్రల స్వామి, కడారి పెంటయ్య, రెడ్డి మాల పెద్ద కృష్ణ, స్కైలాబ్, కోదండ సురేష్, కొత్తపేట ప్రభాకర్, రాజేందర్, దప్పు వినోద్, కటేపక రవి, చెంగల్ చంద్ర మోహన్, కొంగర మహేష్, గౌరీశంకర్, సంగిపేట నరేష్, గోపి మధు, జలేందర్, నరేష్, శ్రీనివాస్, ఏర్పుల గాలయ్య, ఏర్పుల యాదయ్య, మహిళా నాయకులు అనిత, పద్మ, విజయలక్ష్మి, నిర్మల, జ్యోతి, రేణుక, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు నగదు రహిత ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయాలి

**తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద చారి**

**ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయాలని పోస్ట్ కార్డు ఉద్యమం**



**బొంరాస్ పేట, అక్టోబర్ 7 (జనం సాక్షి):** జర్నలిస్టులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా నగదు రహిత ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టియుడబ్ల్యూ హెచ్ - 143) వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద చారి అన్నారు.బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల కేంద్రంలో పోస్టు కార్డు ఉద్యమం నిర్వహించారు.ఈహెచ్ఎస్ కాకుండా ఈజెహెచ్ఎస్ స్కీంను పునరుద్ధరించి మెరుగైన సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్టు కార్డు ద్వారా తమ సమస్యలను తెలిసేలా ఉత్తరాలు పంపారు.ఈ సందర్భంగా ప్రహల్లాద చారి మాట్లాడుతూ జర్నలిస్టులు,వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని జర్నలిస్టుల ఆరోగ్య సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గ యూనియన్ ప్రధాన కార్యదర్శి నరసింహ,కోశాధికారి అశోక్ గౌడ్,ఉపాధ్యక్షులు అనంతయ్య,మండల జర్నలిస్టులు రమేష్,శ్రీకాంత్,వసీం,అక్రమ్,అమృతయ్య,నర్సింలు గౌడ్,సుభాన్ సుధాకర్,శివరాజ్,నరేష్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**: హకీంపేట్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి**



**శామీర్ పేట్, అక్టోబర్ 7(జనం సాక్షి )**ప్రజా ప్రభుత్వం హామీలు నెరవేరుస్తుందికార్మికుల సంక్షేమమే లక్ష్యం అని సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని జిల్లా ఆర్టిఏ మెంబర్, హకీంపేట్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నేపథ్యంలో హకీంపేట్ ఆర్టీసీ డిపోలో టీఎంయూ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.అక్టోబర్ 9న జరగనున్న ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి టీఎంయూ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ డిపోలోని కార్మికులను కలిసి ప్రచారం నిర్వ హించారు.ఈ సందర్భంగా హకీంపేట్ ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, డిపో అధ్యక్షులు తులసీరాం, డిపో సెక్రటరీ పవన్ యాదవ్ కార్మికులతో భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆద్వర్యంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఆర్టీసీ కార్మికుల కోసం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. గతంలో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, సమ్మెలు చేయాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం అని కార్మికులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి అండగా ఉంటాం అని భీమిడి జైపాల్ రెడ్డి తెలిపారు. డిపోలోని కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.డిపో అధ్యక్షులు తులసీరాం మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. డిపోలోని ప్రతి కార్మికుడి సమస్యను సంఘం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా పనిచేస్తామన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు అనుగుణంగా సంఘం కూడా కార్మికుల తరఫున బలంగా పని చేస్తుందని తెలిపారు.డిపో సెక్రటరీ పవన్ యాదవ్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే టీఎంయూ ప్రధాన లక్ష్యమని అన్నారు. కార్మికులకు అందు బాటులో ఉంటూ వారి సమస్యలను యాజమాన్యం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. డిపోలోని కార్మికులందరూ ఐక్యంగా ఉండి టీఎంయూ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని నాయకులు తెలిపారు.ఈ ఎన్నికల్లో కార్మికుల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం, యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లగలిగే గుర్తింపు సంఘాన్ని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అక్టోబర్ 9, 2026న ఉదయం 5 గంటల నుంచి జరగనున్న టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి టీఎంయూ అభ్యర్థులను గెలిపించాలని కార్మికు లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల.వెంకటేశం, మాజీ యంపిటిసిలు ఇర్రి.రవీందర్ రెడ్డి, డప్పు.సాయిబాబా మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు వైస్ గౌడ్,హకీంపేట్ డిపో అధ్యక్షులు తులసిరామ్, సెక్రటరీ పవన్ యాదవ్,రామాలయం మాజీ ధర్మకర్త యన్.హరిగోపాల్,మాజీ ఉప సర్పంచ్ డి.రాజు,కాంగ్రెస్ నాయకులు యస్.వేణుగోపాల్ రెడ్డి, బిక్షపతి,వి.నర్సింహారెడ్డి, విష్ణు, ఎం.సాయి కుమార్,ఎం.బిక్షపతి యాదవ్, బి.భూపాల్ రెడ్డి,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.రమేశ్, ఆర్టీసీ యూనియన్ ప్రతినిధులు నర్సింగ్ రావు, మహేష్,కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీకార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి)**భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సేవా సంకల్ప్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా హయత్‌నగర్ డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. అనంతరం కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవా ప్రయాణాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ ప్రజల్లో సేవా భావాన్ని మరింత పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. దేశం, సమాజం, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం సేవ చేయాలనే స్ఫూర్తిని కార్యకర్తల్లో నింపేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగం ద్వారా దేశ అభివృద్ధి, ప్రజా సేవ, సామాజిక బాధ్యత, దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర వంటి అంశాలపై కార్యకర్తలకు అవగాహన, స్ఫూర్తి కలిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. సేవా సంకల్ప్ అభియాన్ ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు సేవా కార్యక్రమాలను మరింత చేరువ చేస్తూ ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, వివిధ మోర్చాల పదాధికారులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభ్యుదయమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

**చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి**



**శంషాబాద్,అక్టోబర్7(జనంసాక్షి)**గ్రామాల అభ్యుదయమే లక్ష్యంగా ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎంపీ నిధులను మంజూరు చేస్తూ దేశ అభివృద్ధికి పాటుపడుతోందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ముచ్చింతల్, రామాంజపూర్, నానాజీపూర్ గ్రామాల్లో ఎంపీ నిధులతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తోకల శ్రీనివాస్ రెడ్డి, ముచ్చింతల్ సర్పంచ్ కత్తుల సుభాష్ లతో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో దేవేందర్, మైలారం సురేఖ రాజు, ప్రదీప్ రాయుడు పటేల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంది

**వరి ధాన్యం గోదాం నిర్మాణానికి భూమి పూజ**

**వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి**



**బొంరాస్ పేట, అక్టోబర్ 7 ( జనం సాక్షి):** రైతుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్ రెడ్డి అన్నారు.విబిజీరాంజీ పథకం ద్వారా రూ.30 లక్షల నిధులతో మంజూరైన వరి ధాన్యం నిల్వ చేసే గోదాం నిర్మాణానికి బుధవారం విబిజిరాంజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్ తో కలిసి భూమి పూజ నిర్వహించారు.అనంతరం నర్సింలు గౌడ్ మాట్లాడుతూ రైతులు పండించిన పంటను నిల్వ ఉంచడానికి గోదాం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి రైతుల పక్షపాతిగా రైతుల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్నాడన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూర్యకళ లక్ష్మయ్య, ఉపసర్పంచ్ లావణ్య, మహిళా సంఘం అధ్యక్షురాలు అనురాధ,వెంకటమ్మ,లక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, ఆయా గ్రామాల సర్పంచులు కిషన్ నాయక్, సోమ్లా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సినిమా కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా కాకర్ల గోవర్ధన్‌రావు



**ఎల్బీనగర్, అక్టోబర్ 7 (జనం సాక్షి)**పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, క్రమశిక్షణ, సేవలను గుర్తించి కాకర్ల గోవర్ధన్‌రావును బీజేపీ సినిమా కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియమించారు. మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు గోరెడ్డి గిరివర్ధన్‌రెడ్డి సూచనల మేరకు, బీజేపీ కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నియామకం చేపట్టారు. కార్మికుల సంక్షేమం, విభాగం బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాలకుర్తి శేషగిరిరావు, రాపాక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వేలు రైతులు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



**రంగారెడ్డి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** ప్రభుత్వం నిర్వహిస్తున్న భూముల రీ-సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేందుకు రైతుల సహకారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి కోరారు. మహేశ్వరం మండలం ఇమ్మామ్‌గూడ గ్రామంలో చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వారి వెంట ఏ డి ఎస్ ఎల్ ఆర్, మహేశ్వరం తహసీల్దార్, మండల సర్వేయర్, లైసెన్స్డ్ సర్వేయర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేయర్లు క్షేత్రస్థాయిలోకి వచ్చినప్పుడు రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలు, హద్దుల సమాచారాన్ని అందించి పూర్తి సహకారం అందించాలని కోరారు. రీ-సర్వేను పారదర్శకంగా, శాస్త్రీయంగా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చేయాలన్నారు. రైతులకు ఏవైనా సందేహాలుంటే అక్కడికక్కడే నివృత్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనుల పురోగతిని, భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ తదితర అంశాలను అధికారులు పకడ్బందీగా, నిబంధనల మేరకు జరుగుతున్నాయా లేదా అని నిశితంగా పరిశీలించారు. రైతులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ నేరుగా మాట్లాడి రీ-సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టత చెందడంతో పాటు, భవిష్యత్తులో భూ సంబంధిత సమస్యలు పూర్తిగా తగ్గుతాయని, రైతులకు భూమి రికార్డుల విషయంలో మరింత స్పష్టత కలుగుతుందని అధికారులు వివరించారు.

## భాజపా ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా జినుకుంట్ల చంద్రశేఖర్



**తలకొండపల్లి అక్టోబర్ 07(జనంసాక్షి):** భాజపా ఎస్సీ మోర్చా నాగర్ కర్నూల్ జిల్లా ఉపాధ్యక్షులుగా తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్ ను నియమించినట్లు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి,నాగర్ కర్నూల్ పార్లమెంటు భాజపా అభ్యర్థి పోతుగంటి భరత్ బుధవారం తెలిపారు.పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు ఆయనకు సూచించారు.ఈ సందర్భంగా చంద్రశేఖర్ ను శాలువాతో సత్కరించి అభినందించారు.నియామకం పట్ల మండల బీజేపీ నాయకులు,గట్టు ఇప్పలపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి భాజపా మండల అధ్యక్షులు నీలకంఠం పాండు,రామకృష్ణ,పడకల్ ఉపసర్పంచ్ దేవేందర్,మండల యాదగిరి,శ్రీను,దండు శ్రీను,తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

### పీపుల్స్ డిగ్రీ కాలేజీ కో-ఆర్డినేటర్ నాగేశ్వర్ చారి

**తాండూరు అక్టోబర్ 7(జనంసాక్షి)** డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ అడ్మిషన్ల గడువును పొడిగించినట్లు పీపుల్స్ డిగ్రీ కాలేజీ కో-ఆర్డినేటర్ శ్రీ నాగేశ్వర్ చారి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ యూనివర్సిటీలో ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల చివరి తేదీని 13-10-2026 వరకు పొడిగించడం జరిగింది. ఇంటర్ పాస్ అయిన వారు, ఐటీఐ పాస్ అయిన వారు, ఓపెన్ ఇంటర్ పాస్ అయిన వారు ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్ పొందవచ్చని అన్నారు.ఆసక్తి గల విద్యార్థులు మిగతా పూర్తి వివరాలకు తాండూరులోని పీపుల్స్ డిగ్రీ కాలేజీలో సంప్రదించగలరని ఆయన కోరారు.

# ప్లాస్టిక్ కోర్సోలో శిక్షణ పొందిన వారికి మంచి భవిష్యత్

### : ఏవిఎన్ఎల్ జీఎం విజయ్ దత్తు

**కాప్రా, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూషన్ అఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ(సిపెట్)లో ప్లాస్టిక్ కోర్సోలో శిక్షణ పొందిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఏవిఎన్ఎల్ జనరల్ మ్యానేజర్ విజయ్ దత్తు అన్నారు. ఆర్ముడ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్ (ఏవిఎన్ఎల్) సిఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా వెనుకబడిన 38 మంది విద్యార్థులకు చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూషన్ అఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ(సిపెట్)లో ప్లాస్టిక్ కోర్సుపై ఆరు నెలలు పాటు శిక్షణ ఇప్పించింది. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రముఖ ప్లాస్టిక్ పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించారు. బుధవారం సిపెట్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపెట్ హెడ్ బి,రవితో కలిసి శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఉద్యోగం పొందిన లెటర్లను అందజేశారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ సి పెట్ లో ప్లాస్టిక్ కు సంబధించి అన్ని రకాల శిక్షణ కల్పిస్తున్నమని తెలిపారు. తమకు ఉచితంగా శిక్షణ ఇప్పించి



ఉద్యోగం కల్పించిన ఏవిఎన్ఎల్సంస్థకు, చర్లపల్లి సిపెట్ ప్రతినిదులకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సిపెట్ ప్రిన్సిపల్ డైరెక్టర్, హెడ్ బి.రవి మ్యానేజర్ బిశ్రీకర్, సి పెట్ సబ్బంది వివిద పరిశ్రమల ప్రతినిదులు పాల్గొన్నారు.

# దసరాకు 7 వేల ప్రత్యేక బస్సులు

### రద్దీ ప్రాంతాల నుంచి అదనపు సర్వీసులు..టీజీఎస్ఆర్టీసీ..

**ముషీరాబాద్, అక్టోబర్ 7 (జనం సాక్షి):** దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) విస్తృత ఏర్పాట్లు చేసింది. పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. కరీంనగర్ జోన్ పరిధిలో 3,533 ప్రత్యేక బస్సులు నడపనుండగా.. ఆదిలాబాద్‌లో 431, నిజామాబాద్‌లో 719, కరీంనగర్‌లో 1,175, వరంగల్‌లో 530, ఖమ్మంలో 678 బస్సులు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్ జోన్ పరిధిలో 2,155 బస్సులను నడపనుండగా.. మహబూబ్‌నగర్‌లో 645, మెదక్‌లో 255, నల్గొండలో 815, రంగారెడ్డిలో 440 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి మరో 1,312 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఈ నెల 9, 10, 16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండటంతో ఆయా రోజుల్లో డిమాండ్‌కు అనుగుణంగా అదనపు బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. అలాగే తిరుగు ప్రయాణ రద్దీని దృష్టిలో ఉంచుకుని 25, 26 తేదీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్లచెరువు), ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్‌రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర రద్దీ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో పందళ్ళు, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సుల్లో రద్దీ లేకపోతే వాటిని త్వరితగతిన వెనక్కి రప్పించి, రద్దీ ఉన్న మార్గాల్లో నడిపేలా చర్యలు చేపట్టనున్నట్లు సంస్థ తెలిపింది. ప్రత్యేక బస్సుల నిర్వహణ, డీజిల్ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వ జీవో నంబర్ 16 ప్రకారం ప్రత్యేక సర్వీసుల టికెట్ ధరలను 1.5 రెట్లు వరకు సవరించే వెసులుబాటు సంస్థకు ఉంది. ఈ మేరకు దసరా సందర్భంగా నడిపే ప్రత్యేక బస్సుల చార్జీలను సవరించినట్లు టీజీఎస్ఆర్టీసీ వెల్లడించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు మాత్రమే ఈ సవరించిన చార్జీలు వర్తిస్తాయని తెలిపింది. 9, 10, 16, 17, 25, 26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయని, రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే ఉంటాయని స్పష్టం చేసింది.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం కింద పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ తదితర రెగ్యులర్, ప్రత్యేక బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం యథావిధిగా కొనసాగుతుందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి తెలిపారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ కోసం టీజీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ప్రత్యేక బస్సులు, రూట్లు తదితర వివరాల కోసం 040-69440000, 040-23450033 నంబర్లలో ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

## మల్కాజిగిరి కోర్టుకు 2 లక్షల విలువైన 40 బెంచీలను అందజేసిన సిఐఎఫ్ఎ

**కాప్రా ,అక్టోబర్ 7( జనంసాక్షి ):** సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఫ్రెండ్స్ అసోసియేషన్(సిఐఎఫ్ఎ) అధ్వర్యంలో కుషాయిగూడ మల్కాజ్గిరి జిల్లా కోర్టుకు రెండు లక్షల విలువైన 40 బెంచీలను అందజేశారు. ప్రతి రోజు కోర్టుకు వచ్చే న్యాయవాదులకు, కాక్షిదారులు బెంచీలు లేక ఇబ్బంది పడుతున్నరని విషయం తెలుసుకుని చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిదులు జక్కా రోషిరెడ్డి, వెంకటరత్నం, బీముడు, కిషోర్ కుమార్, కిషోర్, ఎంవిఎస్ మూర్తి, గోపాలక్రిష్ణ, హరిహర సుబ్రమణ్యం, రాము, శివాజీ, శ్రీనివాస్ బెంచీలను అందజేశారు. ఈసందర్బంగా అసోసియేషన్ ప్రతినిదులు మాట్లాడుతూ స్నేహంతో ఒకటై సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నమని తెలిపారు. సభ్యుల సహకారంతో సమిష్టి భాగస్వామ్యంతో ప్రజలు ఉపయోగపడే కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. గతంలో ఈ అసోసియేషన్ అధ్వర్యం ఈసిఐఎల్ బస్టాండ్ లో వాటర్ ప్యూరిఫైర్ మిషన్, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. తమ ఇబ్బందిని గుర్తించి కోర్టుకు 40 బెంచీలను అందజేసిన



చర్లపల్లి ఇండస్ట్రీయల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిదులకు కోర్టు అడ్మినిస్టేటివ్ అధికారి అలీఅస్గర్, నజీర్, భాస్కర్, కోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిదులు కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కోర్ట్ బార్అసోసియేషన ప్రతినిదులు, పారిశ్రామికవత్తలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాండూరు పట్టణ ప్రముఖులు

### సత్యనారాయణ బాబా ఆకస్మిక మృతి

**తాండూరు అక్టోబర్ 7(జనంసాక్షి)** తాండూరు పట్టణానికి చెందిన ప్రముఖులు, కీ.శే. రామ్ ప్రసాద్ బాబా కుమారుడు సత్యనారాయణ బాబా బుధవారం ఆకస్మికంగా మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్టణంలో తీవ్ర విషాదాన్ని నింపింది.ఆయన అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 గంటలకు వారి స్వగృహం నుండి బయలుదేరుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.సత్యనారాయణ బాబా మృతిపట్ల పలువురు ప్రముఖులు, వ్యాపార వర్గాలు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# మహిళా పొదుపు సంఘాల ప్రగతి ఆదర్శనీయం

## ఎన్.ఐ.ఆర్.డి బృందం ప్రశంసలు




**శంకర్‌పల్లి, అక్టోబర్ 7 (జనం సాక్షి)**మహిళా పొదుపు సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబాలకు అండగా నిలుస్తున్న తీరు అభినందనీయమని ఎన్ఐఆర్‌డి బృందం ప్రశంసించింది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మాసానిగూడ గ్రామాన్ని బుధవారం 12 రాష్ట్రాలకు చెందిన జిల్లాస్థాయి అధికారుల బృందం సందర్శించింది. లతన్ సింగ్ నేతృత్వంలోని ఎన్ఐఆర్‌డి బృందం గ్రామంలోని పొదుపు సంఘాలు, గ్రామ సంఘం పనితీరును పరిశీలించింది.పొదుపుతో ఆర్థిక స్వావలంబన:మాసానిగూడలో 30 మహిళా సంఘాలు ఉన్నాయని, ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు పొదుపు చేసుకుంటున్నారని మహిళలు తెలిపారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది వ్యవసాయం, కిరాణా దుకాణాలు, పిండిగిర్ని, పాల వ్యాపారం, ఎంబ్రాయిడరీ కటింగ్ షాప్, బట్టల దుకాణం, ఎంబ్రాయిడరీ తదితర వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబానికి ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలుస్తున్నట్లు వివరించారు.మహిళల ప్రగతిపై అధికారుల అభినందన: మహిళా సంఘాలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాలను ఎన్ఐఆర్‌డి బృందం సభ్యులు స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలే స్వయంగా బ్యాంకులకు వెళ్లి రుణాలు పొందడం, వాటిని సక్రమంగా తిరిగి చెల్లిస్తూ వ్యాపారాల్లో రాణించడం అభినందనీయమని లతన్ సింగ్ పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ అర్చన ప్రభుగౌడ్, ఉపసర్పంచ్ భూలక్ష్మమ్మ,ఏపీఎం రవీందర్,కమ్యూనిటీ కోఆర్డినేటర్ సుధాకర్, వీవోఏ స్వరూప,పంచాయతీ కార్యదర్శి అమీద్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపుల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యం

## తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు గంప చంద్రమోహన్



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 7, (జనం సాక్షి) :** రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మున్నూరు కాపు సామాజికవర్గం తమ రాజకీయ, సామాజిక హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు గంప చంద్రమోహన్ పిలుపునిచ్చారు. రాజ్యాధికార దిశగా అడుగులు వేసినప్పుడే సమాజంలో ఆశించిన మార్పులు, పురోగతి సాధ్యమవుతాయని అన్నారు.బుధవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ 2026--2029 రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కట్టెల సుభాష్‌ను నియమించారు. ఈ సందర్భంగా గంప చంద్రమోహన్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రంగాల్లో మున్నూరు కాపులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, జనాభా ప్రాతిపదికన దక్కాల్సిన రాజకీయ ప్రాతినిధ్యం, వాటా పూర్తిస్థాయిలో లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ స్థాయి నుంచి నగరాల వరకు మున్నూరు కాపు సంఘాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మున్నూరు కాపు యువత ముందువరుసలో నిలవాలని పిలుపునిచ్చారు. యువతకు మహాసభ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో అన్ని జిల్లాల్లో మున్నూరు కాపు ఐక్యతా సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో కట్టెల సుభాష్‌కు ఉన్న సుదీర్ఘ అనుభవం, సేవా దృక్పథం మహాసభ బలోపేతానికి ఎంతో ఉపయోగపడుతుందని గంప చంద్రమోహన్ అన్నారు.కట్టెల సుభాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మహాసభ రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించిన అధ్యక్షుడు గంప చంద్రమోహన్, కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు సమాజ ఐక్యత, ప్రగతి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తానని పేర్కొన్నారు.కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర నాయకులు కొండూరు వినోద్‌కుమార్, గడేకర్ల సత్యనారాయణ, ఆవుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో జలమండలి సమస్యలను పరిష్కరించండి



## పిఏసి చైర్మన్ అరికెపూడి

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధి ప్రజల సౌకర్యార్థం జలమండలి విభాగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. మేరకు నియోజకవర్గం పరిధిలో నెలకొన్న సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై బుధవారం మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జలమండలి ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో మంచినీటి వ్యవస్థ, డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ పనితీరుపై శేరిలింగంపల్లి డివిజన్ జలమండలి విభాగం అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రతి ఫిర్యాదుపై స్పందించాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలని, ప్రజలనుండి వచ్చే ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి తగినన్ని సేవలు అందించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా అరికెపూడి తెలియజేశారు. నిత్యావసరాలలో ప్రధానమైన నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ప్రజలకు కలుషితంగాని స్వచ్ఛమైన మంచినీరు అందించాలని జలమండలి అధికారులను కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమగ్ర, సంతులిత అభివృద్ధిలో భాగంగా ప్రతి డివిజన్ లో మౌలికవసతుల కల్పన కొరకై అవసరమైన ప్రతిపాదనలు సేకరించడం జరిగిందని, ఆయా కాలనీలలో అవసరమైనచోట భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్, మంచి నీటి పైప్ లైన్ పనుల కొరకు నూతన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పనులు త్వరితగతిన చేపట్టాలని, అత్యవసర పనులను గుర్తించి ప్రథమ ప్రాధాన్యతాక్రమంలో వాటిని పూర్తి చేయడానికి అధికారులు కృషి చేయాలని సూచించడం జరిగిందన్నారు. మురుగు నీరు పొంగకుండా శాశ్వత పరిష్కారందిశగా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజి వ్యవస్థపై ప్రత్యేక దృష్టిని సారించాలని, మంచినీటితో మురుగునీరు కలిసి తమయే చోట్లను గుర్తించి సత్వరమే వాటిని అరికట్టడానికి చేపట్టాల్సిన చర్యలను గూర్చి అధికారులకు స్పష్టంగా వివరించడం జరిగిందని, ఆ దిశగా తప్పకుండా అధికారులు ముందుకు సాగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఈడి సంతోష్ రెడ్డి, జిఎం లు శ్రీకృష్ణ, హరిశంకర్, తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దర్గ వెంకటేష్ గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి, అధికారులు డిజిఎం లు శ్రీమన్నారాయణ, శ్రీనివాస్ రాజు, నరేందర్, శ్రీహరి, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ గృహాల్లో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి తనిఖీ



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 07 (జనం సాక్షి) :** సైదాబాద్‌లోని దివ్య జ్యోతి బాలుర బాలల సం రక్షణ గృహం, వైదేహి బాలికల బాలల సంరక్షణ గృహాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి కార్యదర్శి ఎ.శ్రీదేవి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా బాల బాలికలతో మాట్లాడిన ఆమె.. వారి విద్య, ఆరోగ్యం, భద్రత, ఆహారం, వసతి, దైనందిన అవసరాలు, సంక్షేమా నికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకు న్నారు. సంరక్షణ గృహాల్లో బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. బాలలకు సురక్షి తమైన, ఆరోగ్యకరమైన, బాలల అనుకూల వాతా వరణం కల్పించాలని నిర్వాహకులు, సిబ్బందికి సూచించారు. బాలల హక్కులు, వారికి అందుబా టులో ఉన్న ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి బాలుడు, బాలికకు మెరుగైన విద్య, సంరక్షణ, భద్ర త అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బాలల సంరక్షణ గృ హాల నిర్వాహకులు, సిబ్బంది, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# పట్టా భూమికి దారి అడ్డుకుంటున్నారు న్యాయం చేయాలి

## బాధితుడు శంకర్ నాయక్ ఆవేదన



**శంకర్‌పల్లి, అక్టోబర్ 7 (జనం సాక్షి)**తన పట్టా భూమిలోకి వెళ్లకుండా దారికి అడ్డంగా రాళ్లు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని పొన్నగుట్ట తండాకు చెందిన శంకర్ నాయక్ కోరారు.బుధవారం శంకర్‌పల్లిలో విలేకరులతో మాట్లాడు తూ..తనకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు.2023లో కొనుగోలు చేసిన పట్టా భూమి పొద్దుటూరు గ్రామంలోని సర్వే నంబర్లు 650/అ-1, 650/అ-2లో ఎకరా 25 గుంటల పట్టా భూమిని 2023లో కొనుగోలు చేసినట్లు శంకర్ నాయక్ తెలిపారు.తన పొలం పక్కనే ఉన్న పులకండ్ల మల్లారెడ్డి తండ్రి రుక్మా రెడ్డి తనభూమి లోకివెళ్లకుండా అడ్డుకుంటున్నారనిఈ విషయంపై గతంలోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అధికారులు రెండు నెలల క్రితం సర్వే నిర్వహించి రోడ్డు పక్కన 25 గుంటల ప్రభుత్వ భూమి ఉన్నట్లు నిర్ధారించారని తెలిపారు.రాళ్లు తొలగించినా మళ్లీ అడ్డంకులు ప్రభుత్వ భూమి నుంచి తన పొలంలోకి వెళ్లి వ్యవసాయం చేసుకుంటున్న సమయంలో మల్లారెడ్డి మళ్లీ దారికి అడ్డంగా పెద్ద రాళ్లు వేసి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు.ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులు సోమవారం వచ్చి రాళ్లు తొలగించారని తెలిపారు.అయితే తిరిగి ప్రభుత్వ భూమిని దున్ని తన రాకపోకలకు అడ్డంకులుసృష్టిస్తున్నారని,దీనిపై మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.అధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని శంకర్ నాయక్ కోరారు.

# తలకొండపల్లిలో 9వ జాతీయ పోషణ మాసం ఘనంగా అక్షరాభ్యాసం,అన్నప్రాసన



**తలకొండపల్లి అక్టోబర్ 7(జనంసాక్షి):**మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య,ఉప సర్పంచ్ నూకం కోటీశ్వర్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ అంజయ్య,వార్డు సభ్యులు వెంకటేష్ యాదవ్,కిషోర్,విఠల్,అంగన్వాడీ సూపర్వైజర్,అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు,ఏఎన్ఎంలు,గ్రామ మహిళలు,తల్లులు,చిన్నారి బాల బాలి కలు ,తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లిలో ఘనంగా 'సేవా సంకల్ప్ అభియాన్'

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం లో చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో 'వికసిత్ భారత్ సంకల్ప సభ' మరియు 'సేవా జ్యోతి యాత్ర' ర్యాలీ కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి బిజెపి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి మరియు శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్, జిల్లా ఇన్‌చార్జ్ ఆలె భాస్కర్ తదితరులు హాజరయ్యారు. సభ అనంతరం క్రిస్టల్ గార్డెన్స్ నుండి చందానగర్ స్వాగత్ హోటల్ వద్దగల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులతో కలిసి 'సేవా జ్యోతి యాత్ర' ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 2014 తర్వాత దేశ ప్రధానమంత్రిగా నేటి వరకు 25 సంవత్సరాలుగా నరేంద్ర మోదీ ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఆయన నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, 2014కి ముందు దేశ పరిస్థితి ఏమిటో, నేడు భారత ప్రధానిగా మోదీ పాలనలో భారత్ ఏ స్థాయికి చేరిందో ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని డాక్టర్ కె. లక్ష్మణ్ తెలియజేశారు. భారతదేశంలో అంతర్గతంగా మౌలిక సదుపాయాల కల్పన, తయారీ రంగం, డిజిటల్ విప్లవం, మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం వంటి అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఆయన కొనియాడారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ మోదీ పాలనలో సంక్షేమం దేశంలోని చిట్టచివరి వ్యక్తి వరకు చేరిందని, జన్ ధన్ ఖాతాలద్వారా పేదలకు బ్యాంకింగ్ వ్యవస్థ చేరువైందని, ఉజ్వల యోజనద్వారా కోట్లాది మంది తల్లులకు పొగలేని స్వచ్ఛమైన వంట గ్యాస్ కనెక్షన్లు అందాయని, జల్ జీవన్ మిషన్ ద్వారా మారుమూల



పల్లెల్లో సైతం ఇంటింటికీ స్వచ్ఛమైన నల్లా తాగునీరు అందుతోందని, పీఎం ఆవాస్ యోజనతో పేదల సొంతింటి కల సాకారమవుతుండగా, ఆయుష్మాన్ భారత్ పేదలకు కొండంత ఆరోగ్య భరోసానిచ్చిందన్నారు. ఈ సంక్షేమ పథకాల వల్లే స్వతంత్ర భారత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని రవికుమార్ యాదవ్ వివరించారు. మోదీ పాలన స్వార్థంకోసం కాదు-సమాజం కోసం, పదవి కోసం కాదు-ప్రజల కోసం, వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు-దేశ ప్రయోజనం కోసం సాగుతోందని తెలియజేస్తూ 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా తీర్చిదిద్ది, ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలపాలన్నది ప్రధాన మంత్రి దృఢ సంకల్పంగా ఆయన అభివర్ణించారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్క కార్యకర్త, పౌరుడు ఈ మహా యజ్ఞంలో భాగస్వామ్యం కావాలి అని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, ప్రొఫెషనల్ సెల్ కన్వీనర్ బాల్దా అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజిత్,ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షులు హనుమంత్ నాయక్, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మరియు బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చాల నాయకులు, పదాధికారులు, అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉదయ్ కుమార్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమం

### వికలాంగులు, చిన్నారులు, తల్లులకు ఆహారం.. దుప్పట్ల పంపిణీ




**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 7 (జనం సాక్షి ):** పెద్ద అంబర్‌పేట పరిధిలోని తట్టి అన్నారంలో వెన్నెల డి-అడిక్షన్ సెంటర్ సంస్థాపకుడు ఉదయ్ కుమార్ జయంతి సందర్భంగా 'సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగులు, చిన్నారులు, వారి తల్లులకు ఆహారం అందించడంతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు.సమాజంలోని పేదలు, నిరుపేదలు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జయంతి వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా మానవతా విలువలను చాటినట్లు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడినవారు, వికలాంగులు, చిన్నారులకు ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. భవిష్యత్తులోనూ అవసరమైన వారికి అండగా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేసి నిర్వాహకులను అభినందించారు.

## నేటి నుండి పట్టభద్రుల ఓటు ఉచిత నమోదు ప్రారంభం.

### గ్రాడ్యుయేట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు న్యాయవాది జిలాని.

**తాండూరు ఆక్టోబర్ 7(జనంసాక్షి):** హైదరాబాద్ - మహబూబ్ నగర్ - రంగారెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఉచిత ఓటు నమోదు ప్రక్రియను గురువారం 8వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రాడ్యుయేట్స్ ఫోరం వికారాబాద్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది జిలాని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గ్రాడ్యుయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఓటు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటు నమోదు కోసం సంప్రదించాల్సిన ఇన్చార్జ్‌లు.తాండూరు నియోజకవర్గంఆర్. అశోక్ గ్రాడ్యుయేట్స్ ఫోరం అధ్యక్షులు, పోన్ 9949373480,మోయిస్ బేగ్ - పట్టణ అధ్యక్షులు తాండూరు టౌన్, పోన్ 9515636786,స్థలం మదీనా కాంప్లెక్స్, తాండూర్.కొడంగల్ నియోజకవర్గంఈ. శ్రీనివాస్ - కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు, పోన్ 9573344663,వికారాబాద్ నియోజకవర్గం.కే. శ్రీనివాస్ - వికారాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు వికారాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్, పోన్: 9959239303. పరిగి నియోజకవర్గం.రామకృష్ణ - పరిగి నియోజకవర్గ అధ్యక్షులు, పోన్ 9000958839.ఓటు నమోదు కోసం తీసుకురావాల్సిన పత్రాలు. 1) డిగ్రీ మార్క్స్ మెమో,2) ఆధార్ కార్డ్,3) ఓటర్ ఐడి,4) పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో - 1 పై పత్రాలతో సంబంధిత ఇన్చార్జ్‌లను సంప్రదించి ఉచితంగా ఓటు నమోదు చేసుకోవాలని జిలాని కోరారు.

## బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై.. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆగ్రహం

- కదిలే బస్సులో జరిగిన పరిణామాన్ని తప్పుడు పోస్టులు
- బిడ్డలాంటి పిల్లలతో ప్రేమగా మాట్లాడితే వక్రీకరిస్తారా
- ఆడబిడ్డలంటే అపారమైన గౌరవం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి, అక్టోబర్ 7 (జనంసాక్షి) :** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు తీరు గురించి తెలుసుకునేందుకు ఆర్టీసీ బస్సెక్కిన నేపథ్యంలో సోషల్ మీడియాలో బీఆర్ఎస్ చేసిన ప్రచారంపై ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి మండి పడ్డారు. తప్పుడు ప్రచారాన్ని ఖండిస్తూ వీడియో విడుదల చేశారు. బస్సు ప్రయాణం గురించి తన బిడ్డల్లాంటి విద్యార్థినులతో ప్రేమగా మాట్లాడితే... దానిని వక్రీకరించటం సరికాదన్నారు. కాలేజ్ జోన్ అయిన ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఉచిత బస్సు ప్రయాణం ఎక్కువగా ఉపయోగించుకుంటారని, దీని అమలు తీరును పరిశీలించేందుకే మంగళవారం బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద ఆర్టీసీ బస్సెక్కినట్లు చెప్పారు. తనను చూసి విద్యార్థులందరూ వచ్చి మాట్లాడే క్రమంలో తన బిడ్డల మాదిరిగా ప్రేమతో వారితో ముచ్చటించినట్లు చెప్పారు. సర్కిల్ వద్ద మలుపు తిరిగే క్రమంలో కదులుతున్న బస్సులో చిత్రీకరించిన దృశ్యాలను బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో తప్పుగా ప్రచారం చేయిస్తున్నారన్నారు. తన ఇంటి ఆడబిడ్డల్లా మహిళల్ని గౌరవిస్తానని చెప్పారు. బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలిని ప్రజలు గమనించాలని చెప్పారు.

# ముడుపుల ఆరోపణలు.. మౌనం వెనుక మతలబేంటి?

కాల్స్, వాట్సాప్ ఫిర్యాదులకు కూడా స్పందన ఉండటం లేదని ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్, పార్కింగ్, డ్రైనేజీ సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముడుపుల ఆరోపణలపై ఆధారాలు వెల్లడికావాల్సి ఉండగా, నిర్మాణాల అనుమతులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టి సారించి సర్కిల్ పరిధిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై స్పందించని సిబ్బంది పనితీరును సమీక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## విజయారెడ్డిని కలిసిన సామ రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 7, జనం సాక్షి :** మహబూబ్‌నగర్,రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి బుధవారం ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ పి. విజయారెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు పరస్పరం అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేసు కున్నారు. పార్టీ కార్యక్రమాలు, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరంపై కూడా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా సేవా జ్యోతి యాత్ర - బైక్ ర్యాలీ



**దోమ అక్టోబర్ 07 జనం సాక్షి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా,వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు యు.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర - బైక్ ర్యాలీలో కెఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు శరత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పరిగి నుంచి సీనియర్ నాయకులు,నాయకులు మరియు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## దళితుల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

### ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్, అక్టోబర్ 7 జనం సాక్షి :** దళితులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు దేనని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్‌లోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో బీఆర్ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళిత బంధు పథకం ద్వారా మరింత మంది అర్హులకు లబ్ధి చేకూర్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు గోల్కొండ మైసయ్య, మల్లెపాక యాదగిరి, ఉమామహేశ్వర్, పార్లపు శ్రీధర్, మద్దెల నర్సింహ, రుద్రల స్వామి, కదారి పెంటయ్య, కృష్ణ, స్టైలాక్, కోదండ సురేష్, కొత్తపేట ప్రభాకర్, రాజేందర్, దప్పు వినోద్, కటేపక రవి, చెంగల్ చంద్ర మోహన్, కొంగర మహేష్, గౌరీశంకర్, సంగిపేట నరేష్, గోపి మధు, జలేందర్, నరేష్, శ్రీనివాస్, ఏర్పుల గాలయ్య, ఏర్పుల యాదయ్యతో పాటు మహిళా నాయకులు అనిత, పద్మ, విజయలక్ష్మి, నిర్మల, జ్యోతి, రేణుక, లక్ష్మి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

## మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సభను విజయవంతం చేయాలి

**రంగారెడ్డి, అక్టోబర్ 7 (జనంసాక్షి):** బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, మాన్యవర్ కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న 'బహుజన సమరభేరి' బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు గుండె శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బడంగ్ పేట మున్సిపల్ గ్రౌండులో ఈ నెల 9న నిర్వహించనున్న బహుజన బేరీ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనుల అభ్యున్నతి కోసం కాన్షీరామ్ అందించిన సేవలను కొనియాడారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న ఈ మహాసభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి సుమారు 4 వేల మంది కార్యకర్తలు, అభిమానులు, బహుజనులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి గడుసు ప్రవీణ్, మున్సిపల్ అధ్యక్షులు సి. హెచ్. కరుణాకర్, సెక్టార్ అధ్యక్షులు పి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో 22 పీఎం శ్రీ పాఠశాలల్లో స్పెషల్ ఎడ్యుకేటర్ల భర్తీ

- జిల్లా విద్యాశాఖ అధికారి రేణుక దేవి
- అక్టోబర్ 13 వరకు దరఖాస్తులు
- నెలకు రూ.16,500 గౌరవ వేతనం
- ఐదు నెలలపాటు తాత్కాలిక నియామకం





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 22 పీఎం శ్రీ సెకండరీ పాఠశాలల్లో గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) రేణుక దేవి తెలిపారు. సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు నాణ్యమైన విద్యా మద్దతు అందించడం, సమ్మిళిత విద్య ను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ నియామకాలు చేపడుతున్నారు. జిల్లాలోని 22 పీఎం శ్రీ సెకండరీ పాఠశాలలకు ఒక్కొక్కరు చొప్పున, గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్లను 2026 నవంబర్ నుంచి 2027 మార్చి వరకు ఐదు నెలపాటు పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన నియమించనున్నారు. ఈ పాఠశాలలు మేడ్చల్, దుండిగల్-గండిమైసమ్మ, బాచుపల్లి, ఉప్పల్, మేడిపల్లి, కప్రా, షామీర్‌పేట్, కీసర, ఘట్‌కేసర్, మూడుచింతలపల్లి మండలాల్లో ఉన్నాయి.

**అర్హతలు..** బి.ఎడ్. (స్పెషల్ ఎడ్యుకేషన్), బి.ఎడ్. (జనరల్)తో పాటు డిప్లొమా/పీజీపీడీ/పీజీపీసీ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్, పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎస్ఎల్‌టీసీ ఇన్ విజువల్ ఇంపెయిర్మెంట్, సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ ది డెఫ్ లేదా బిఎ, బిఎడ్. ఇన్ విజువల్ ఇంపెయిర్మెంట్ అర్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మెరిట్ ఆధారంగా స్థానిక గ్రామం, మండలం, జిల్లా క్రమంలో అర్హులైన స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సంబంధిత అనుభవం ఉన్నవారికి కూడా ప్రాధాన్యత ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు తమకు కేటాయించిన పాఠశాలతో పాటు భావితా కేంద్రంలో సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి.

**గౌరవ వేతనం..** ఎంపికైన ప్రతి గెస్ట్ స్పెషల్ నీడ్స్ ఎడ్యుకేటర్‌కు నెలకు రూ.16,500 గౌరవ వేతనం చెల్లించబడుతుంది. మండల విద్యాశాఖాధికారి ధ్రువీకరించిన హాజరు ధ్రువపత్రం ఆధారంగా ఈ మొత్తాన్ని విడుదల చేస్తారు. విధులు.. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను గుర్తించడం, అంచనా వేయడం, వ్యక్తిగత విద్యా ప్రణాళికలు రూపొందించడం, నమోదు మరియు విద్య కొనసాగింపునకు సహకరించడం, పాఠశాలలు మరియు గృహ సందర్శనలు నిర్వహించడం, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ అందించడం, భావితా కేంద్రాలు మరియు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ తో సమన్వయం చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తించాల్సి ఉంటుంది. దరఖాస్తు విధానం.. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు మరియు ఇతర సంబంధిత పత్రాల ప్రతులతో కూడిన దరఖాస్తులను సంబంధిత పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయునికి 13-10-2026 లోపు సమర్పించాలి. పాఠశాలల వివరాలు సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయి. ఈ నియామకాలు పూర్తిగా తాత్కాలికమైనవి, స్వల్పకాలికమైనవి. నిర్ణీత గడువు ముగిసిన వెంటనే సేవలు స్వయంచాలకంగా ముగుస్తాయి. భవిష్యత్తులో ఎలాంటి నియామకానికైనా హక్కు లేదా క్లెయిమ్ ఉండదని జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు.

# వికసిత్ భారత్ లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలి

**2047 నాటికి భారత్‌ను ప్రపంచంలో అగ్రదేశంగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ లక్ష్యం : సంఘటన్ మంత్రి మధుకర్ జీ**



**కీసర (జనంసాక్షి) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని తెలంగాణ సంఘటన్ మంత్రి మధుకర్ జీ పిలుపునిచ్చారు. మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాగారం డివిజన్‌లోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సేవా జ్యోతి యాత్ర కార్యక్రమానికి సుమారు వెయ్యి మంది నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ సంఘటన్ మంత్రి మధుకర్ జీ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. 2047 నాటికి భారత్‌ను ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, అభివృద్ధి చెందిన దేశంగా నిలబెట్టాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మోదీ నాయకత్వంలో ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ నిర్మూలన, సర్జికల్ స్ట్రైక్స్, డీమోనిటైజేషన్, రామజన్మభూమి ఆలయ నిర్మాణం, పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు చేపడుతోందన్నారు. పార్టీ నిర్మాణంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పార్టీ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తే రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**నాగారం డివిజన్‌లో బీజేపీ జెండా ఎగరడం ఖాయం : కౌకుట్ల చంద్రారెడ్డి**



రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాగారం డివిజన్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. నరేంద్ర మోదీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, దేశసేవ కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. భారతీయ జనతా పార్టీలో పనిచేయడం అంటే భారతమాతకు సేవ చేయడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, జిల్లా ఇంచార్జి సామ రంగారెడ్డి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంపల్లి మోహన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్ రెడ్డి, శోభారెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అమరం మోహన్ రెడ్డి, గోనె శ్రీనివాస్, బిటి.లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు ఘనపురం శ్యాంసుందర్ శర్మ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ఏనుగు రాజిరెడ్డి, నాగారం డివిజన్ అధ్యక్షులు కొండబోయిన నాగరాజు యాదవ్, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, జిల్లా పదాధికారులు, డివిజన్ అధ్యక్షులు, మోర్చా అధ్యక్షులు, నాగారం డివిజన్ పదాధికారులుకీసర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రూఫ్‌టాప్ టవర్.. స్థానికుల ఆందోళన

**అనుమతులు, భద్రతా ప్రమాణాలు పరిశీలించాలంటూ డీసీకి ఫిర్యాదు**

**కీసర, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** నాగారం మెయిన్‌రోడ్ ప్రాంతంలో నిర్మిస్తున్న రూఫ్‌టాప్ సెల్‌ఫోన్ టవర్‌పై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటుతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటూ ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డికి ఫిర్యాదు చేశారు. బలమైన గాలులు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో టవర్ లేదా దానికి సంబంధించిన పరికరాలు కిందపడే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొన్నారు. సమీప నివాసితుల భద్రతతోపాటు ఆరోగ్యపరమైన అంశాలపై కూడా ఆందోళన వ్యక్తం చేశారు. టవర్ ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు, నిర్మాణ భద్రత, ఫైర్ సేఫ్టీ, ఈఎంఎఫ్ నిబంధనలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినట్లు తేలితే తక్షణమే చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ప్రమాదకరంగా ఉన్నట్లయితే టవర్‌ను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. అధికారుల పరిశీలన అనంతరం నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నాగులు, సామాజిక కార్యకర్త అక్కల సురేశ్‌కుమార్, స్థానికుడు మల్లేశ్ ఉన్నారు.

# రేపు లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్‌లో దసరా ఉత్సవాలు

**కీసర, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** లీడ్ ఇండియా భారత్ రత్నాస్ స్కూల్‌లో దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని 'దసరా ఉత్సవ్'ను శుక్రవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. దసరా పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ధర్మం, సత్యం, మంచితనం చెడుపై సాధించే విజయాన్ని చాటే రామ్‌లీలా తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెలంగాణ సంస్కృతి, భారతీయ సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ, దాండియా కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు ఉత్సాహంగా పాల్గొనేలా కార్యక్రమాలను రూపొందించారు. అందరూ ఆహ్వానితులే.. దసరా ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాధారెడ్డి కోరారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# వైద్య సేవల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలి

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఆనంద్‌ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి**



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఆనంద్‌ను బుధవారం కలెక్టరేట్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

**ప్రభుత్వ వైద్య సేవలపై చర్చ :** ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలు, ఆసుపత్రుల్లో అవసరమైన మౌలిక వసతులు, ప్రజారోగ్య సమస్యలపై ఇరువురు చర్చించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలో వైద్యరంగానికి సంబంధించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సమన్వయంతో పనిచేస్తామని లక్ష్మారెడ్డి తెలిపారు.

# ఫీవర్ సర్వేలు ముమ్మరం చేయాలి

**దోమల నివారణ చర్యలను కట్టుదిట్టం చేయండి**

**డీఎంహెచ్‌వో డా.పుట్ల శ్రీనివాస్**

**ఫీవర్ ఆస్పత్రిలో వైద్య సేవలపై సమీక్ష**



**హైదరాబాద్, అక్టోబర్ 07 (జనంసాక్షి)**

డెంగ్యూ, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఫీవర్ సర్వేలు, యాంటీ లార్వల్ చర్యలను మరింత వేగవంతం చేయాలని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్లకుంట ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వే, యాంటీ లార్వల్ కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది చేపడుతున్న ఫీవర్ సర్వేలు, లార్వా నియంత్రణ చర్యలను పరిశీలించి పలు సూచనలు చేశారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి సకాలంలో యాంటీ లార్వల్, ఇతర నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదా బస్తీ దవాఖానను సంప్రదించి, ఉచిత వైద్య సేవలు పొందాలని కోరారు.



**ఫీవర్ సర్వే నుంచి ఫీవర్ ఆస్పత్రి వరకు..**
**డీఎంహెచ్‌వో తనిఖీ**

అనంతరం ఫీవర్ ఆస్పత్రిని సందర్శించిన డీఎంహెచ్‌వో ఓపీ, ఇన్‌పేషెంట్ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో స్వయంగా మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు డా.సాయిబాబా, డా.శ్రీకళ, వైద్యాధికారి డా.దీప్తి పటేల్, జిల్లా మలేరియా అధికారి ఎస్.ఆంజనేయులు, మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, జీహెచ్ఎంసీ ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు. ఫీవర్ ఆస్పత్రి సందర్శనలో సూపరింటెండెంట్ డా.ముసాఖాన్, ఆర్ఎంఓ డా.వీరాంజనేయులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# రాళ్ల గర్భంలో బంగారం.. చరిత్ర గర్భంలో వైభవం

**తాండూరు అక్టోబర్ 7(జనంసాక్షి)**

వికారాబాద్ జిల్లా పశ్చిమ సరిహద్దున, కర్ణాటక రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న పట్టణమే తాండూరు. పేరు వింటేనే రాయి, దుమ్ము గుర్తొస్తాయి. కానీ ఈ పట్టణం లోతుల్లోకి వెళ్తే కనిపించేది చరిత్ర, పారిశ్రామిక వైభవం, రాజకీయ చైతన్యం, సాంస్కృతిక సౌరభం.

**చరిత్ర - నిజాం నుండి నేటి వరకు..**

తాండూరుకు 300 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. నిజాం పాలనలో ఇది ఒక ముఖ్యమైన వాణిజ్య కేంద్రం. హైదరాబాద్ సంస్థానం నుండి గుల్బర్గా వెళ్లే రైలు మార్గంలో తాండూరు కీలక జంక్షన్. 1948 సెప్టెంబర్ 17న జరిగిన పోలీస్ చర్య తర్వాత భారత యూనియన్ లో విలీనమైంది. నిజాం కాలం నాటి పాత తాండూరు కోట శిథిలాలు నేటికీ ఆనాటి వైభవాన్ని గుర్తు చేస్తాయి.

**భౌగోళికం - ప్రకృతి వరం..**

దక్కన్ పీఠభూమిపై, సముద్ర మట్టానికి 450 మీటర్ల ఎత్తులో ఉంది. చుట్టూ చిన్న చిన్న గుట్టలు, నల్లరేగడి నేల. కోకట్ వాగు, మల్రెడ్డిపల్లి చెరువు ఈ ప్రాంతానికి జీవనాడులు. ఇక్కడి వాతావరణం వేసవిలో తీవ్రంగా ఉన్నా, వర్షాకాలంలో ఈ గుట్టల మధ్య ప్రకృతి పచ్చదనం పరుచుకుని పర్యాటకులను ఆకర్షిస్తుంది.

**ఆర్థిక వెన్నెముక - మూడు స్తంభాలు..**

**తాండూరు స్టోన్ - ప్రపంచ ఖ్యాతి..**



తాండూరును ప్రపంచ పటంలో నిలిపింది ఈ రాయి. ఇక్కడ దొరికే షా బాద్ లైమ్ స్టోన్ (నీలం, పసుపు, నలుపు రంగుల్లో) దేశంలోనే అత్యంత నాణ్యమైన ఫ్లోరింగ్ స్టోన్. రాజస్థాన్ తర్వాత అతిపెద్ద సహజ రాతి పరిశ్రమ ఇదే. దాదాపు 50,000 మందికి ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి. హైదరాబాద్ లోని శంషాబాద్ ఎయిర్ పోర్ట్, బెంగళూరు ఇన్ఫోసిస్ క్యాంపస్ లో ఈ రాయినే వాడారు.

**సిమెంట్ హబ్..**

తాండూరు గర్భంలో ఉన్న 500 కోట్ల టన్నులకు పైగా సున్నపురాయి నిల్వల వల్లనే ఇక్కడ పరిశ్రమలు వెలిశాయి. సీసీఐ (భారత ప్రభుత్వ రంగ సంస్థ), పెన్నా సిమెంట్, విచెమ్ సిమెంట్ ఫ్యాక్టరీలు. తెలంగాణ సిమెంట్ ఉత్పత్తిలో 40శాతం వాటా తాండూరుదే.



**వ్యవసాయం..**

ఇక్కడి ప్రధాన పంట కందిపప్పు (తూర్ దాల్). తాండూరు కందికి ప్రత్యేక జీఐ ట్యాగ్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనితో పాటు జొన్న, మొక్కజొన్న, పత్తి, పసుపు పండిస్తారు.

**రాజకీయ చైతన్యం - అధికారానికి గీటురాయి..**



తాండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అత్యంత సెన్సిటివ్. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం అయినా, ఇక్కడి ఫలితం రాష్ట్ర రాజకీయాలపై ప్రభావం చూపుతుంది. మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వంటి నేతల మధ్య పోరు ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటుంది.

**సంస్కృతి, ఆధ్యాత్మికం - గంగా జమునా తెహజీబ్**

భద్రప్ప ఆలయం.. 200 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం, తాండూరు గ్రామ దేవుడు. జామా మసీదు మరియు బషీరాబాద్ దర్గా మత సామరస్యానికి ప్రతీకలు. గణేష్ నిమజ్జనం.. హైదరాబాద్ తర్వాత అంత ఘనంగా జరిగే నిమజ్జనం తాండూరులోనే. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 350కి పైగా భారీ గణపతులు ఊరేగుతాయి. విశ్వకర్మ, పద్మశాలి, కురుమ సంఘాలు ఇక్కడ బలమైన సామాజిక శక్తులు.

**విద్య, వైద్యం, రవాణా..**

తాండూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాలలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. 200 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. హైదరాబాద్–వాడి రైల్వే లైన్ లో తాండూరు ఒక ముఖ్యమైన స్టేషన్. హైదరాబాద్ నుండి 110 కి.మీ దూరం.

రాతి పరిశ్రమ వల్ల వచ్చే సిలికోసిస్ వ్యాధి, గుట్టల విధ్వంసం, తాగునీటి కొరత, యువత వలసలు తాండూరు ముందున్న ప్రధాన సవాళ్లు. పరిశ్రమల నుండి వచ్చే కాలుష్యాన్ని నియంత్రించి, పర్యాటకంగా గుట్టలను అభివృద్ధి చేస్తే తాండూరు తెలంగాణలోనే ఒక మోడల్ పట్టణంగా ఎదగగలదు.రాయి కఠినమైనది, కానీ తాండూరు ప్రజల మనసు వెన్నపూస. శ్రమను నమ్ముకుని బతికే ఈ గడ్డ తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక.

